క్లుప్తంగా

స్వయం సహాయక సంఘాలు అభివృద్ధి చెందాలి



ర్యాలీ చేస్తున్న వీఓఏలు

దెందులూరు: స్వయం సహాయక సంఘాలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని దెందులూరు ఎంపీడీఓ మద్ది భీమరాజు తెలిపారు. శనివారం దెందులూరులో వెలుగు ఏపీఎం సురేష్ ఆధ్వర్యంలో వీఓఏల శిక్షణ ర్యాలీ నిర్వహించారు. అనంతరం 9వ వార్డులో మానవహారం చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో భీమరాజు మాట్లాడుతూ లెక్కలు ప్రతి సభ్యురాలికి తెలిసే విధంగా మన లెక్కలు యాప్ ఉపయోగపడుతుందన్నారు. సంఘంలో తీసుకున్న ప్రతి సభ్యురాలు పొదుపు అప్పు అవగాహన ఉండాలన్నారు. ఈ సమావేశంలో దెందులూరు తహసీల్దార్ బీ.సుమతి, అన్ని శాఖల మండల అధికారులు పాల్గొన్నారు.

నిరంతర విద్యుత్ సరఫరాకు ప్రత్యేక చర్యలు



టవర్లు ఏర్పాటు చేస్తున్న విద్యుత్ సిబ్బంది

దెందులూరు: మండలంలోని దెందులూరులో నిరంతర విద్యుత్ సరఫరాకు నాలుగు టవర్లు ఏర్పాటు చేయడం జరుగుతుందని విద్యుత్‌శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీనివాస్ తెలిపారు. శనివారం దెందులూరు సబ్‌స్టేషన్ పరిధిలో జరుగుతున్న పనులను విద్యుత్ శాఖ ఏలూరు రూరల్ ఏడి శ్రీనివాసరావు, దెందులూరు ఏఈ శ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ గ్రామాల్లో నిత్యం విద్యుత్ సరఫరాకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ సరఫరాలో ఎటువంటి ఇబ్బంది లేకుండా ఈ టవర్ల నిర్మాణం జరుగుతుందన్నారు.

నేలకొరిగిన భారీ వృక్షం



నేలకొరిగిన భారీ వృక్షం

దెందులూరు: మండలంలోని శ్రీ రామవరం వద్ద రోడ్డు పక్కన భారీ వృక్షం ఇటీవల కురిసిన వర్షాలకు నేలకొరిగింది. ఆర్అండ్‌బి అధికారులు భారీ వృక్షం పడిపోయిన పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. తమ పామాయిల్ మొక్కలపై భారీ వృక్షం పడిపోవడంతో అధికారులు తీస్తారా తామే తీసుకోవాలా అర్థం కావడం లేదన్నారు. వెంటనే అధికారులు స్పందించి భారీ వృక్షాన్ని తొలగించాలని రైతులు కోరుతున్నారు.

కోఆపరేటివ్ సొసైటీ ద్వారా రైతులకు రుణాలు

పెదపాడు: రైతులకు కావాల్సిన రుణాలను సత్వరమే అందజేస్తున్నట్లు త్రీమెన్ కమిటీ చైర్మన్ గారపాటి స్టాలిన్ తెలిపారు. పెదపాడు కోఆపరేటివ్ సొసైటీ సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సమావేశంలో సొసైటీ ప్రగతిని చదివి వినిపించారు. సొసైటీలో ఆర్జించిన లాభాలను డివిడెండ్ రూపంలో సభ్యులకు అందజేస్తున్నట్లు తెలిపారు. ఆర్థిక లావాదేవీలను కార్యదర్శి డీవీ సుబ్బారావు చదివి వినిపించారు. ఈకార్యక్రమంలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.

బాలకృష్ణ బహిరంగ క్షమాపణ చెప్పాలి



పోకల రాంబాబు

దెందులూరు: అసెంబ్లీ సాక్షిగా మెగాస్టార్ చిరంజీవిని ఉద్దేశించి వ్యంగంగా మాట్లాడిన నందమూరి బాలకృష్ణ వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని దెందులూరు నియోజకవర్గం కాపు సంఘం అధ్యక్షుడు వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోకల రాంబాబు అన్నారు. మెగాస్టార్ చిరంజీవికి దెందులూరు నియోజకవర్గం కాపు సంఘం మద్దతు ప్రకటిస్తున్నామని ప్రకటిస్తున్నామని తెలిపారు. శనివారం దెందులూరులో ఆయన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కరోనా అంటేనే భయపడుతున్న సమయంలో కూడా చలనచిత్ర పరిశ్రమ సమస్యలు పరిష్కరించారన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి

ఏలూరు(టూటౌన్): సర్వీస్ రోడ్లు నిర్మించకపోవడం, అండర్ పాస్‌కు తగినంత ఎత్తు వెడల్పు లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ అన్నారు. శనివారం ఏలూరులో గ్రీన్‌ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతుల సమస్యలపై ఎంపీ పుట్టా మహేష్ యాదవ్‌కు వినతిపత్రం అందించారు.

వలంటీర్లను నమ్మించి గొంతు కోశారు!

- గత ప్రభుత్వంలో ప్రజలకు సేవలందించిన వలంటీర్లు
- పారదర్శకంగా పథకాల అమలుకు కృషి చేసిన సేవకులు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వ్యక్తులతో పాటు వ్యవస్థలపైన కూడా కక్ష కట్టింది. ప్రజలకు ప్రభుత్వానికి వారధిలా.. ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ ఫలాలను లబ్ధిదారుల ఇంటి వద్దకే అందించి దేశ వ్యాప్తంగా మన్ననలు అందుకున్న వలంటీర్ వ్యవస్థను నిర్వీర్యం చేసింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో దేశంలో ఎక్కడా లేనివిధంగా ప్రప్రథమంగా వలంటీర్ వ్యవస్థ పురుడుపోసుకుంది. అనతికాలంలోనే ప్రతిష్టాత్మకంగా ప్రజలకు ప్రభుత్వ సేవలు అందుతుండడంపై దేశమంతా ఏపీ వైపు చూసింది. అయితే ఇంత గొప్ప వ్యవస్థను కూటమి నేతలు ఎన్నికల ముందు ఆయుధంగా వాడుకొని.. అధికారంలోకి వచ్చాక అసలు వలంటీర్ వ్యవస్థే లేదు.. దానికి చట్టబద్ధతే లేదంటూ నిర్వీర్యానికి తొలిఅడుగు వేశారు.

దెందులూరు: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నాటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి 2019 ఆగస్టు 15న వలంటీర్ల వ్యవస్థను అమలులోకి తీసుకువచ్చారు. జిల్లాలో గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా పౌర సేవలను ప్రజల ముంగిటకు అందించేలా ఈ వ్యవస్థకు శ్రీకారం చుట్టి ఐదేళ్ల పాటు విజయవంతంగా కొనసాగించారు. ముఖ్యంగా ఒకటో తేదీన ఇంటి వద్దకే పింఛన్, ప్రజలకు అవసరమయ్యే ప్రతి పనిని లోకల్ గవర్నెన్స్‌లో భాగంగా సచివాలయాలకు అనుబంధంగా వలంటీర్లు సేవలందించారు. విపత్తుల వేళ వలంటీర్లు ఎనలేని సేవలు అందించి ప్రజలు అభిమానాన్ని చూరగొన్నారు. జిల్లాలో 10వేల మందికిపైగా ఉన్న వలంటీర్లు ఐదేళ్లపాటు ప్రజలకు సేవలందించి.. ఇప్పుడు ఉపాధి లేక జీవితాలు దుర్భరంగా మారాయని వాపోతున్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం తుంగలో తొక్కడంతో నిశ్చేష్టులై ఉన్నారు.

ఇంటి వద్దకే వెళ్లి పెన్షన్ ఇచ్చేవారు..

జిల్లాలో ప్రతి నెలా ఒకటో తారీఖున సగటున 2.50 లక్షల మందికి సుమారు రూ.3,800 కోట్లను లబ్ధిదారులకు పెన్షన్ల కింద వలంటీర్లు పంపిణీ చేశారు. వేకువజాము నుంచి మధ్యాహ్న సమయానికే 95 శాతానికి పైగా పంపిణీ పూర్తి చేసేవారు. కోవిడ్ వంటి విపత్కర పరిస్థితుల్లోనూ ఇంటింటా వైద్య సేవలతో పాటు వ్యాక్సినేషన్, ప్రభుత్వ సాయం అందజేతలో వలంటీర్లు కీలకంగా పనిచేశారు. తమ ప్రాణాలను పణంగా పెట్టి సేవలందించారు.



గత ప్రభుత్వ హయాంలో వలంటీర్లను సత్కరించిన ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి, పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి కారుమూరి సునీల్ (ఫైల్)

అవినీతికి తావులేకుండా..

వలంటీర్ వ్యవస్థ ద్వారా అవినీతికి ఆస్కారం లేకుండా.. నేరుగా పథకాలు ప్రజలకు చేరవేయడంతో దేశవ్యాప్తంగా గుర్తింపుదక్కింది. పలు రాష్ట్రాల్లో వలంటీర్ల వ్యవస్థను అమలుచేసే ఉద్దేశ్యంతో ఆయా రాష్ట్రాల ప్రతినిధులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కరోనా సమయంలో వలంటీర్లు అందించిన సేవలను జిల్లా స్థాయి ఉన్నతాధికారులు సైతం కొనియాడారు. వారి సేవలను గుర్తిస్తూ ఏటా ఉత్తమ సేవకులకు పురస్కారాలు అందించి ప్రోత్సహించారు.



వలంటీర్లకు వందనం కార్యక్రమంలో మాట్లాడుతున్న అప్పటి ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి (ఫైల్)

ఎన్నికల ముందు.. తర్వాత

ఎన్నికల సమయంలో వలంటీర్లను కూటమి నేతలు వంటీర్లకు గౌరవవేతనం రూ.5వేలు కాదు రూ.10 వేలు ఇస్తామని నమ్మించారు. వలంటీర్ వ్యవస్థకు తాము వ్యతిరేకం కాదని చెప్పారు. తీరా అధికారంలోకి వచ్చిన తరువాత వలంటీర్ వ్యవస్థ సరికాదని, చట్టబద్ధత లేదని గొంతుకోశారు. దీంతో జిల్లాలో 10వేల మంది వలంటీర్లను తొలగించి వారి జీవితాలను అంధకారంలోకి నెట్టారు. వలంటీర్ల వ్యవస్థ ఏర్పడి ఆరేళ్లు పూర్తికాగా.. వ్యవస్థ నిర్వీర్యమై ఏడాదిన్నర దాటింది.

నమ్మించి మోసం చేశారు



కూటమి నాయకులు ఎన్నికల ముందు వలంటీర్లకు అండగా ఉంటామని, జీతం రూ.10వేలు ఇస్తామని నమ్మించారు. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే లక్షలాది మంది వలంటీర్లను తొలగించారు. మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ వ్యవస్థకు ప్రత్యేక గుర్తింపు తీసుకువస్తే.. కూటమి నాయకులు దగా చేశారు.

– గొరువర్తి ఏసురాజు, వలంటీర్

విధుల్లోకి తీసుకోవాలి



కూటమి నేతలు అధికారంలోకి రాగానే వలంటీర్లను కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన తరువాత వలంటీర్ వ్యవస్థను రద్దు చేయడంతో ఉపాధి కోల్పోయాం. వలంటీర్ వ్యవస్థను రద్దు చేసి ఏడాదిన్నర పైబడింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం యువతకు ఉపాధి కల్పించేలా వలంటీర్ వ్యవస్థను కొనసాగించాలి.

– ఆకుల పెద్దిరాజు, వలంటీర్

మానవత్వంతో ఆలోచించాలి



కూటమి ప్రభుత్వం మానవతా దృక్పథంతో ఆలోచించాలి. ప్రత్యక్షంగా పరోక్షంగా లక్షలాది మంది వలంటీర్లు వారి జీవన విధానం భద్రతను పరిగణలోకి తీసుకోవాలి. త్వరితగతిన నిర్ణయం తీసుకోవాలి. వలంటీర్ల సేవలను కొనసాగే విధంగా చర్యలు తీసుకోవాలి

– డీబీఆర్‌కే చౌదరి, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి

వలంటీర్లకు న్యాయం చేయాలి



కూటమి ప్రభుత్వం చేత తొలగింపబడిన లక్షలాదిమంది వలంటీర్లు వారిపై ఆధారపడ్డ కుటుంబ సభ్యులు ఎలా బ్రతకాలి, ఎన్నికల ముందు మీరు చెప్పింది ఏమిటి? ఇచ్చిన హామీలు ఏమిటి ఇప్పుడు చేస్తున్నది ఏమిటి? ఇది సరైన విధానమేనా ప్రభుత్వం పునరాలోచించుకోవాలన్నారు. వలంటీర్ల కుటుంబాలకు న్యాయం చేయాలని కోరారు.

– ఎం. దుర్గాకుమారిరాజు, సర్పంచ్, మేధినరావుపాలెం

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి



భీమడోలులో అంబేడ్కర్ జీవితంపై రూపొందించిన కరపత్రాలు ఆవిష్కరిస్తున్న దృశ్యం

భీమడోలు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవితం ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకం కావాలని పూలే అంబేడ్కర్ మిషన్ రాష్ట్ర నాయకులు సిర్రా భరత్ పేర్కొన్నారు. ఈనెల 28వ తేదీన ఆదివారం సాయంత్రం భీమడోలులోని కాట్రగడ్డ కల్యాణ మండపంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ జీవితంపై బుద్ధం శరణం గచ్ఛామి అనే నినాదంతో హైదరాబాద్ వారిచే అబ్బుర పరిచే 770వ స్ఫూర్తి దాయక నాటక ప్రదర్శనను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం భీమడోలు కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పూలే అంబేడ్కర్ మిషన్ జిల్లా నాయకులు అంబటి నాగేంద్ర ప్రసాద్, పాము మాన్‌సింగ్, ముళ్లగిరి జాన్సన్ తదితరులు పాల్గొన్నారు.

హైవేలో సిగ్నల్ లైట్ దుస్థితి



పనిచేయని సిగ్నల్ లైట్

దెందులూరు: మండలంలోని హైవే రోడ్‌లో సిగ్నల్ లైట్ పనిచేయకపోవడమే కాకుండా స్తంభం పడిపోయిన సరే సంబంధిత శాఖల అధికారులు పట్టించుకోని వైనమిది. ఏలూరు జంగారెడ్డిగూడెం రోడ్డులో సోమవరప్పాడు బైపాస్ వద్ద డబుల్ రోడ్డుకు మధ్యలో సిగ్నల్ పోలు పడిపోయింది. లైట్ కూడా వెలగడం లేదు. ప్రతి రోజు సాయంత్రం వందలాది వాహనాలకు ఉపయోగపడే ఈ సిగ్నల్ లైట్ స్తంభం సమస్య పరిష్కరించాలని వాహనదారులు, ప్రయాణికులు, అధికారులను కోరుతున్నారు.

గ్రామాల అభివృద్ధికి అందరూ కృషి చేయాలి

పలు సమస్యలను లేవనెత్తిన వైఎస్సార్ సీపీ ఎంపీటీసీలు



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు

భీమడోలు: గ్రామాల్లోని సమస్య పరిష్కారానికి ప్రతి ఒక్కరూ కలిసి కట్టుగా పని చేయాలని రాష్ట్ర ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు అన్నారు. భీమడోలు ఎంపీపీ సమావేశ మందిరంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ కనమాల రామయ్య అధ్యక్షతన జరిగింది. మండల పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలు, వాటి ప్రగతి, సంక్షేమ పథకాల అమలు, ఇతర సమస్యలపై లేవనెత్తిన సమస్యలపై అధికారులు తగు సమాధానాలు అందజేశారు. గ్రామాల్లోని సమస్యలను లేవనెత్తారు. భీమడోలు నుంచి పెదలింగంపాడుకు వెళ్లే జెడ్పీ రోడ్డు అధ్వానంగా ఉందని, రోడ్డు వేయాలని, కౌలు రైతులకు కూడా అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేయాలని, హౌసింగ్ స్కీంలో ఇండ్లు నిర్మించుకునే వారికి బిల్లులు మంజూరు కావడం లేదని, ఉపాధి హామీ పథకం శ్రమికుల వేతనాలు జమ కావడం లేదని వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ ముళ్లగిరి జాన్సన్, గంటా శ్రీనివాసరావు తదితరులు సమస్యలను సభలో లేవనెత్తారు. వాటికి ఆ శాఖల అధికారులు సమాధానాలు తెలిపారు. గుండుగొలను నుంచి భోగాపురం దళిత గ్రామానికి వెళ్లే పంచాయతీ రోడ్డు అధ్వానంగా మారిందని, వారం రోజుల్లో పనులు చేపట్టకుంటే ప్రజలు ఆందోళన చేసే పరిస్థితులు ఏర్పడ్డాయని గుండుగొలను సొసైటీ అధ్యక్షుడు శిరిబత్తిన కొండబాబు సభ దృష్టికి తెచ్చారు. అదే విధంగా దాళ్వాలో పీఆర్ 126 వరి విత్తనాలు పంట సాగుకు వినియోగించవద్దని వ్యవసాయ శాఖ ప్రకటించిందని, ఇప్పటికే కొంత రైతులు దాళ్వా విత్తనానికి సిద్ధం చేసుకుంటున్నారని దుద్దేపూడి ఎంపీటీసీ పాల్నాటి శ్రీనివాసరావు సభ దృష్టికి తీసుకుని రాగా పక్షం రోజుల్లో స్పష్టత వస్తుందని, ఆందోళన చెందవద్దని ఏవో ఉషారాణి సమాధానమిచ్చారు. తహసీల్దార్ బి.రమాదేవి మాట్లాడుతూ మండలంలోని 12వేల మందికి ఉచితంగా కుల ధ్రువీకరణ పత్రాలు అందించామని, ఇకపై కుల ధ్రువీకరణ పత్రం కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఎటువంటి విచారణ లేకుండానే ధ్రువీకరణపత్రాలు అందిస్తామన్నారు. అనంతరం ఎంపీపీ కనమాల రామయ్య మాట్లాడుతూ మండల పరిషత్ నిధులు లేమితో అభివృద్ధి పనులకు విఘాతం కలుగుతుందని, గ్రామాల్లో పరిపాలనను సాఫీగా జరిగేందుకు యుద్ధప్రాతిపదికన సాగాల్సిన కచ్చా డ్రెయిన్ల పనులు చేయలేని దుర్భర పరిస్థితిని ఎదుర్కొంటున్నామన్నారు. ఇటీవల 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.14లక్షల విడుదల కాగా, ఆ నిధులు అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు చాలడం లేదని వాపోయారు. అదే విధంగా మండల పరిషత్‌కు పంచాయతీ ఏఈ లేకపోవడంతో పంచాయతీరాజ్ పనులు కుంటుపడుతున్నాయని, తమకు స్పందించి నిధులు మంజూరయ్యే విధంగా తమ వంతు కృషి చేయాలని ఆప్కాబ్ చైర్మన్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి, ఏఎంసీ చైర్మన్ శేషగిరి, వైసీపీ ఎంపీటీసీలు దాసరి విజయభాను, ఆల్తి గోపి, సయ్యద్ ఆజామ్, ఇంజేటి జూనియర్, ఎంఈవోలు ఈదుపల్లి శ్రీనివాస్, అయినపర్తి భాస్కర్‌కుమార్, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



భోగాపురంలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది



మహిళలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న దృశ్యం

భీమడోలు: మహిళలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కంటి వైద్య నిపుణులు వెంకట రెడ్డి అన్నారు. గుండుగొలను పంచాయతీ శివారు భోగాపురం గ్రామంలో శనివారం 250మంది మహిళలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. అదే విధంగా 28మందికి క్యాన్సర్ పరీక్షలు చేసారు. బీపీ, సుగర్, రక్తహీనత, హీమోగ్లోబిన్ పలు రకాల పరీక్షలు చేశారు. కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యులు వెంకటరెడ్డి మాట్లాడుతూ మహిళలు తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, లేని పక్షంలో అనారోగ్య సమస్యలతో కుటుంబమంతా సతమతమవుతారన్నారు. 40 ఏళ్ల దాటిన ప్రతి ఒక్కరూ ఆరోగ్య పరీక్షలు తరచు చేయించుకోవాలన్నారు. తొలుత వివిధ శాఖల సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దలు కోడూరి లక్ష్మీనరసింహామూర్తి, రమణమూర్తి, చిన్నారావు, రాజారత్నం, నల్ల శంకర్, సీహెచ్‌వో ఇందిర, డీవైహెచ్‌ఈవో మధుసూధనరావు, ఎంఎల్‌హెచ్‌పీ, ఇతర శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య శిబిరాలు వినియోగించుకోవాలి

గణపవరం: ముందస్తు వైద్య పరీక్షల ద్వారా వ్యాధులు రాకుండా చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారి ఓంకార్‌నాథ్ అన్నారు. శనివారం గణపవరం సచివాలయం–2లో ఆరోగ్య అవగాహన, వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల ఆరోగ్యరక్షణకు స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ పథకం దోహదపడుతుందని ఈపథకాన్ని మహిళలంతా వినియోగించుకోవాలని అన్నారు. కార్యక్రమానికి సర్పంచ్ మూర అలంకారం అధ్యక్షత వహించారు. ఈ ఆరోగ్యశిబిరంలో 250 మంది మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ 30 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళా తప్పని సరిగా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని, ఏదైనా సమస్య ఉన్నట్లు తేలితే అవసరమైన వైద్యం ద్వారా ఉపశమనం పొందవచ్చునన్నారు. పీహెచ్‌సీ సీహెచ్‌వో జాలాది విల్సన్ మాట్లాడుతూ మహిళలు తమ ఆరోగ్యసమస్యలను నిర్లక్ష్యం చేసి ప్రాణాలమీదికి తెచ్చుకుంటున్నారని, మీముంగిటకే వచ్చిన ఆరోగ్య శిబిరాలను వినియోగించుకుని వైద్యసేవలు పొందాలన్నారు. తోట శ్రీను, వీరంకి శ్రీనివాస్,ఆదపరెడ్డి సీతయ్య, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు హ్యూమన్ ట్రాఫికింగ్ వ్యతిరేక దినోత్సవం

దెందులూరు: దెందులూరు సాల్వేషన్ ఆర్మీ చర్చిలో ఆదివారం హ్యూమన్ ట్రాఫికింగ్ వ్యతిరేక దినోత్సవం నిర్వహిస్తున్నట్లు సాల్వేషన్ ఆర్మీ చర్చ్ కోర్ ఆఫీసర్ మేజర్ కాకి రమణయ్య అన్నారు. సమాజాన్ని పట్టిపీడిస్తున్న సమస్యల్లో ప్రధానంగా ఉన్న యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ ఒకటి అన్నారు. సమష్టి కృషి అవగాహన పటిష్టమైన చట్టాలు అమలుతోనే కొంతైనా సమస్య పరిష్కారం అవుతుందన్నారు.

బాధ్యతల స్వీకారం

ఏలూరు(మెట్రో): పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్‌గా విలియమ్స్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జెడ్పీ క్యాంపు కార్యాలయంలో చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీని మర్యాదపూర్వకంగా కలిశారు.

దుర్గమ్మా.. శరణు శరణు

గ్రామాల్లో ఘనంగా దసరా ఉత్సవాలు



శ్రీరామవరంలో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



పెదనింద్రకొలనులో లలితాదేవి అవతారంలో దుర్గామాత



మండలపర్రులో లలితాదేవి అలంకరణలో ఉమాదేవి అమ్మవారు



ఎంఎంపురంలో లలితా త్రిపురసుందరీదేవిగా భవానమ్మ



గోపన్నపాలెంలో కనకదుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు



సీతంపేటలో కనకదుర్గమ్మ అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు



నిడమర్రు బాల వెంకన్న స్వామి ఆలయంలో అన్న సమారాధనలో పాల్గొన్న భక్తులు



గుండుగొలనులో వారాహిదేవి అలంకరణలో భ్రమరాంబికా మల్లేశ్వర స్వామి



పోతునూరులో అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న యూత్



గణపవరంలో అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

దెందులూరు: దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆరోరోజైన శనివారం అమ్మవారు వివిధ అలంకరణలో దర్శనమివ్వగా..భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. సామూహిక కుంకుమార్చనలు వైభవంగా జరిగాయి. భక్తులకు ఇబ్బంది లేకుండా కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన మండపాలు భక్తులతో కళకళలాడుతున్నాయి. గోపన్నపాలెం శ్రీ కనకదుర్గమ్మ తల్లి ఆలయంలో గ్రామ మాజీ సర్పంచ్ ఆలయ కమిటీ కొండేటి హనుమంతు, తోట రామకృష్ణ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మహిళ భక్తులు సేవకులు అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. శ్రీరామవరంలో కనకదుర్గమ్మకు ప్రత్యేక అలంకరణ చేసి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక భజనలు చేశారు. సీతంపేట గ్రామంలో కనకదుర్గమ్మ విశేష అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పోతునూరు గ్రామంలో శ్రీ కనకదుర్గమ్మ తల్లి యూత్ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కొవ్వలి, పోతునూరు, గంగన్నగూడెం, జోగన్నపాలెం, ఉండ్రాజవరం, గాలాయగూడెం, పెరుగుగూడెం, చల్ల చింతలపూడి గ్రామాల్లో దసరా మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి.

లలితాదేవిగా దుర్గామాత

నిడమర్రు: మండలంలో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శనివారం ఆరోరోజు అమ్మవారు లలితాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. బువ్వనపల్లి, పెదనింద్రకొలను, మండలపర్రు, నిడమర్రు, పత్తేపురం గ్రామాల్లో అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. దసరా ఉత్సవాల్లో భాగంగా నిడమర్రు బాల వెంకటేశ్వరస్వామి ఆలయంలో భారీ అన్న సమారాధన నిర్వహించారు. 10వేల మందికి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయంలో దాత బాసిరాజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త నాయుడు దొరబాబు, సభ్యులు ఇంటి బాబి తదితరులు ఏర్పాట్లు పాల్గొన్నారు.

లలిత త్రిపురసుందరీదేవిగా కనకదుర్గమ్మ

గణపవరం: దసరా నవరాత్రి ఉత్సవాలు గ్రామాల్లో వైభవంగా జరుగుతున్నాయి. శనివారం అమ్మవారిని లలిత త్రిపురసుందరీదేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు. గణపవరం ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో కన్యకాపరమేశ్వరి వర్తకసంఘ భవనంలో వాసవీమాతకు ప్రత్యేక అలంకరణలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. చినరామ చంద్రపురం కనకదుర్గ విశేష అలంకరణ చేశారు. మహిళలు పెద్దసంఖ్యలో అమ్మవారికి కుంకుమపూజలు నిర్వహించారు. బాలయ్యచెర్వు వద్ద కంచికామాక్షి కనకదుర్గ అమ్మవారి ఆలయంలో భక్తులు కుంకుమ పూజలు చేశారు. బస్టాండువద్ద సలాదివారి వీధిలో కనకదుర్గ అమ్మవారికి పూజలుచేశారు. పిప్పర కనకదుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

గుండుగొలనులో వారాహిదేవిగా అమ్మవారు

భీమడోలు: దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఆరోరోజైన శనివారం ఘనంగా జరిగాయి. అమ్మవార్లకు మహిళలు పెద్ద ఎత్తున కుంకుమ పూజలు చేశారు. మండలంలోని భీమడోలు, గుండుగొలను, పూళ్ల, సూరప్పగూడెం, ఎంఎంపురం, అంబర్‌పేట, కోడూరుపాడు, వడ్లపట్ల, కొల్లేరు గ్రామాల్లో తెల్లవారుజాము నుంచి భక్తులు దుర్గమ్మకు విశేష పూజలు చేశారు. భీమడోలు గ్రామంలోని రావిచెట్టు, పోస్టాఫీసు రోడ్డు, భీమడోలు జంక్షన్‌లో ఉత్సవ విగ్రహాల వద్ద భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి ప్రత్యేక పూజలు చేశారు. భీమడోలు జంక్షన్‌లో చిన్నారులతో నిర్వహించిన కోలాట భజనలు చూపరులను ఆకట్టుకున్నాయి. దేవదాయ ధర్మదాయ శాఖ పరిధిలోని గుండుగొలనులో భ్రమరాంబికా మల్లేశ్వర స్వామి ఆలయంలో వారాహిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పూళ్ల పంచాయతీ పరిధిలోని ఎంఎంపురం దుర్గమ్మ ఆలయంలో అమ్మవారు లలితా త్రిపురసుందరీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. నరెడ్లగూడెంలోని గద్దెపై వేంచేసియున్న అమ్మవారికి విశేష పూజలు చేశారు.